ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023

5

కాకినాడ

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శృతి మించుతున్న అతి వేగం

- నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- హెల్మెట్ లేక మరణాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఈ నెల 13న తాళ్లరేవు 216 జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మద్యం మత్తులో ఉండి అతి వేగంతో మోటారు సైకిల్ పై రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. గత నెల 17న కాకినాడ రామారావుపేట తెలుగు తల్లి విగ్రహం వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాల పాలయ్యాయి. మోటార్ సైకిల్‌పై వేగంగా వచ్చి ఆర్‌టిసి బస్సును ఎదురుగా ఢీకొనడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఒకరికి తీవ్ర గాయాలవగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో నేటికీ వైద్యం పొందుతున్నాడు. సెప్టెంబర్ 20న హైవే వాహనాన్ని ఒక వ్యాన్ ఢీకొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఇలా అనేక ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగా తరచూ జరుగుతున్నా వాహనదారులు ఎటువంటి జాగ్రత్తలూ పాటించడం లేదు. గమ్యానికి చేరుకోవాలనే తొందరపాటు వలన పలువురు శృతి మించిన వేగంతో వాహనాలను, హెల్మెట్లు లేకుండా మోటార్ సైకిళ్లను నడుపుతున్నారు. మద్యం మత్తులో రోడ్లపైకి వచ్చి ప్రమాదాల గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకరిద్దరకు బదులు ముగ్గురు, నలుగురు బైకులపై ప్రయాణాలు చేస్తూ అదుపుతప్పి ఇతర వాహనాలను ఢీకొట్టిన సంఘటనల్లో అనేకమంది మృతి చెందడమే కాకుండా క్షతగాత్రులుగా కూడా మిగులుతున్నారు. ఒక వైపు ప్రయాణికుల నిర్లక్ష్యం మరోవైపు ప్రభుత్వ అలసత్వం వెరసి ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల మరమ్మతులు కనీసంగా చేయడం లేదు. పెద్ద పెద్ద గుంతలతో ఎక్కడకక్కడ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ కారణంతోనే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాలకులు కనీసంగా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాళ్లరేవులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతులు

సగటున 23 మరణాలు

వివిధ సందర్భాలలో కాకినాడ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో నెలకు సగటున 23 మరణాలు సంభవిస్తున్నాయి. గతేడాది 808 ప్రమాదాలు జరగ్గా 338 మంది చనిపోయారు. అంటే నెలకు సగటున 28 మరణాలు సంభవించాయి. 93 ప్రమాదాలు తీవ్ర స్థాయిలో జరిగాయి. 322 ప్రమాదాలు మరణాలకు దారితీశాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 635 ప్రమాదాలు జరగగా 278 మంది మరణించారు. నెలకు సగటున 23 మరణాలు జరుగుతున్నాయి. వీటిలో 98 తీవ్ర ప్రమాదాలున్నాయి. మరణాలకు దారి తీసిన ప్రమాదాలు 253 జరిగాయి. మితిమీరిన వేగంతో 60 శాతం ప్రమాదాలు జరుగుతున్నట్టు అంచనా. 20 శాతం మద్యం సేవించి నడపడం, 10 శాతం ఓవర్ టెక్ చేయడం వల్ల, 20 శాతం నిబంధనలకు విరుద్ధంగా నడపడం వల్ల జరుగుతున్నాయి. సుమారు 50 శాతం మరణాలు మోటార్ బైక్ ద్వారానే సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. బ్లాక్ స్పాట్‌లు, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-216లపై ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో జాతీయ రహదారుల వెంబడి వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబల్ స్టిక్కర్స్ వంటివి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి. అప్రోచ్ రోడ్లపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. రహదారుల వెంబడి ఆక్రమణలు తొలగించాలి.

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మోడీని గద్దె దించి, దేశాన్ని కాపాడాలి

అఖిలపక్ష సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-కాకినాడ

మోడీ 9 ఏళ్ల పరిపాలనలో 80 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారని, ఆయనను గద్దె దించి దేశాన్ని కాపాడాలని పలువురు అఖిలపక్ష నాయకులు పిలుపు ఇచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక, రైతాంగ మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఐఎన్‌టియుసి, అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరు రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలకిచ్చే పప్పు, ఉప్పు, పెన్షన్ వంటి పథకాలపై కార్పొరేట్ మేధావివర్గం పెద్దఎత్తున దేశభివృద్ధికి నష్టమని ప్రచారం చేస్తూ, మరోపక్క కార్పొరేట్ కంపెనీలకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీపై పల్లెత్తు మాట్లాడకుండా దేశప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పులు పాలై దేశంలో ప్రతి 20 నిమిషాలకూ ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పారు. రైతాంగ పంటలకు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి గిట్టుబాటు ధర చట్టం చేస్తేనే రైతాంగాన్ని సంక్షోభం నుండి కాపడగలమన్నారు. దేశవ్యాప్తంగా నిత్యవసరాలు ధరలు ఆకాశాన్ని చేరుకుంటుంటే ప్రజలు ఎలా బతకాలని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుముడి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు మాట్లాడుతూ తక్షణం నిత్యవసరాలపై జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తులు వంటగ్యాస్‌పై కేంద్రం విధించిన ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలన్నారు. కాకినాడ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల్లో పంట సాగుబడి జరుగుతుంటే జగన్ ప్రభుత్వ కొనుగోలు నామమాత్రంగానే ఉందని, దీంతో జిల్లా రైతాంగం తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. తక్షణం మొత్తం పంటని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి మోడీ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై తీవ్రమైన భారాలు మోపుతుందని రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్ల పేరుతో యూనిట్ 50 రూపాయలు అమ్ముకునేందుకు కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసిందని విమర్శించారు. ప్రజలను అధిక ధరల నుండి నిరుద్యోగం నుండి రైతాంగ సంక్షోభం నుండి పక్కదారి పట్టించేందుకే బిజెపి పెద్దలు మతోన్మాదాన్ని ప్రాంతీయ తత్వాన్ని కులపరమైన విభజలను తీసుకువస్తూ ప్రజలను విభజిస్తుందని వీటి నుండి ప్రజలు పోరాటాలు చేయడం ద్వారా బిజెపి విధానాలను తిప్పుకొట్టాలని అందుకు 27 28 విజయవాడలో జరిగే మహా ధర్నాలో వేలాదిమంది అసంఘటితరంగా కార్మికులు వ్యవసాయ కార్మికులు కౌలు రైతులు పారిశ్రామిక కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మోడీ జగన్ జోడిలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లూరి వెంకటేశ్వర్లు, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యన్నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శాఖా రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, రైతు సంఘం నాయకులు అప్పారెడ్డి, మధ్యతరగతి రంగం నాయకులు దుంపల ప్రసాద్, వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు లచ్చారావు, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రవతి, ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సిఐటియు రూరల్ కమిటీ కన్వీనర్ తొట్టిపూడి రాజా, చంద్రరావు, ఐఎంటియుసి నాయకులు కె.సాయి, బాషా తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రపాలెం సీలింగ్ భూమి సమస్యలపై సోమవారం చేపట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎపి రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. ఆదివారం గుర్రప్పాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా దళితులు, బలహీన వర్గాల ప్రజల సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలని సంవత్సర కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంఎల్‌ఎ అనుచరులకు ఆ భూములను కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే కాలయాపన చేస్తున్నారని చెప్పారు. తుప్పలు డొంకలు మెట్టలతో ఉన్న భూమిని చదును చేసే సాగులో తీసుకొచ్చి జీవనోపాధిగా మలుచుకుని ఎస్‌సి, బిసి కులాలకు చెందిన పేదలు జీవనం సాగిస్తున్నారన్నారు. అధికారులు కాలయాపన చేయకుండా నిష్పక్షపాతంగా అర్హులైన సాగుదారులకి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.సురేష్, బ్రహ్మం, యేసు రత్నం, లక్ష్మి అక్క, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గణిత పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

బచ్చు ఫౌండేషన్ స్కూల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రామానుజన్ గణిత అకాడమీ నిర్వహించే 34వ జాతీయ గణిత పోటీలు రాష్ట్రవ్యాప్తంగా గణిత స్ఫూర్తితో ఆదివారం జరిగాయి. ఈ మేరకు అకాడమీ కార్య నిర్వాహక సభ్యుడు, ప్రముఖ గణితావధాని తోటకూర సాయి రామకృష్ణ వివరాలను అందజేశారు. ప్రిలిమనరీ పరీక్షలు గత సెప్టెంబర్ నెలలో ఆయా స్కూల్స్‌లో నిర్వహించారు. వాటిలో ప్రతిభ చూపిన 10 శాతం విద్యార్థులను ఫైనల్ పరీక్షకు ఎంపిక చేసి, నిర్ణయించిన కేంద్రాల్లో నిర్వహించినట్టు తెలిపారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సెంటర్ కన్వీనర్‌గా కె.శివప్రసాద్ వ్యవహరించారు. సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో విలువైన బహుమతులు, నగదు పురస్కారాలు, గ్రంథాలు, మెమెంటోలతో ప్రముఖుల ద్వారా సత్కరించనున్నట్లు సాయి రామకృష్ణ తెలిపారు. వచ్చే నెల 17న రామచంద్రపురంలో బహుమతి ప్రధాన సదస్సు వ్యవస్థాపకులు డాక్టర్ కెవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

దివిలిలో 'బాబు ష్యూరిటీ..'

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి మండల అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం దివిలి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. టిడిపి తిరిగి అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు మొయిళ్ల కృష్ణమూర్తి, బూత్ కన్వీనర్ నానేపల్లి రఘు, రాంబాబు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ రేలంగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యం పురాతన ఆరోగ్య వ్యవస్థ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రకృతి వైద్యం అనేది సంప్రదాయ, సహజ వైద్యంతో ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని మిళితం చేసే పురాతన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అని ప్రకృతి వైద్యులు డాక్టర్ వేదుల శ్రీరామ శర్మ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాశ్చాత్య అల్లోపతి వైద్య విధానం పుట్టకముందు ఎన్నో వేల సంవత్సరాలకు పూర్వమే ప్రకృతి వైద్య విధానం ఉందన్నారు. ఔషధ రహిత చికిత్స ద్వారా సానుకూల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి మన దేశంలో ఏటా 2018 నవంబర్ 18 నుంచి జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఆహారం, జీవనశైలి మార్పులపై సలహాలు ఇవ్వడం నుంచి మానసిక ఆరోగ్యాన్ని సాధించడానికి మార్గ నిర్దేశం చేయడంతో వైద్య ప్రపంచంలో ప్రకతి వైద్యానికి ప్రముఖ స్థానం ఉందని డాక్టర్ వేదుల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, టి.సూర్యారావు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఏలేశ్వరం అనేక చట్టాలు సంస్కరణలు తీసుకొచ్చి ప్రధానిగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఇందిరాగాంధీ నిలిచారని కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు ఇన్చార్జ్ ఉమ్మడి వెంకట్రావు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 126 జయంతి పరిస్కరించుకుని ప్రత్తిపాడు కళామందిర్ సెంటర్లో ఆమె విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి మిఠాయిలు పంపిణీ చేశారు. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా తెలియజేసిన ఉక్కు మనిషి ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు ధరణాలకోట శ్రీను, ఎస్‌సి సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ తేజోమూర్తుల ఉషారాణి, జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్య ప్రకాశరావు, కాంగ్రెస్ నాయకులు కొప్పన కోటేశ్వరరావు, పోతాబత్తుల పెద్దబాబు, కె.శామ్యూల్, పదివేల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. **సామర్లకోట** శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్ర పటానికి మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సునేత్ర దేవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యమానికి స్థానిక గ్రంథాలయ అధికారి బందిల రత్న కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలన్నారు. నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని సునేత్రా దేవి పిలుపు నిచ్చారు. సోమవారం జరిగే గ్రంథాలయ ముగింపు ఉత్సవాలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారని రత్నమణి చెప్పారు. పాఠకులు, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** ఇందిరాగాంధీ ప్రధాని హోదాలో తన ధైర్య సాహసాలతో చెరగని ముద్ర వేశారని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, బుద్ధరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



సామర్లకోటలో..

ప్రత్తిపాడులో..

మత్స్యకార దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 21న కోరంగిలో నిర్వహించే ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ సభా వేదిక ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మత్సకార దినోత్సవం సందర్భంగా రూ.165 కోట్ల ఒఎన్‌జిసి పరిహారాన్ని 24,500 మంది లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. దీని కోసం అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని తెలిపారు. వచ్చిన లబ్ధిదారులందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలువురు మంత్రులు, ఎంపీలు, రెండు జిల్లాల ఎంఎల్‌ఎలు హాజరవు తున్నారని వెల్లడించారు. ఆయన వెంట ఎంపిడిఒ ఎం.అనుపమ, ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, కోరంగి కార్యదర్శి రామరాజు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ మారుతీ రావు, కోరంగి సర్పంచ్ పి.మంగేష్, స్థానిక నాయకులు విష్ణు, పలువురు ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని పోలీస్ విశ్రాంతి ఉద్యోగి బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రోడ్డు భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. దీన్ని అదుపు చేయడానికి ప్రజల్లో అవగాహన కల్పించి ప్రమాదాలు నివారించాలనే లక్ష్యంతో 2003 నుంచి నవంబర్ మూడో ఆదివారం రోడ్డు భద్రతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దీన్ని అదుపు చేయడానికి గాను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించే వారిపై భారీగా జరిమానాలు విధిస్తున్న సంగతి గమనించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.పది వేల జరిమానా, జైలు శిక్ష కూడా ఇటీవల న్యాయమూర్తులు విధించిన సంగతి గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని తక్షణం ఆసుపత్రిలో చేర్చి ప్రాణాలు నిలిపే వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం రూ.5000 బహుమతి ప్రకటించిందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, రాజా పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చంటిబాబు

భారత్ పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

మల్లేపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై పి.చౌదరి పెట్రోల్ బంక్‌ను ఆదివారం జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొర్రంపాలెం సర్పంచ్ పోకల సుబ్బారావు, రఘురామ్, అవసరాల పార్థసారథి, పల్లపు విష్ణు, ఒబిన్ని వీరబాబు, బి.రాజా పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - పెద్దాపురం

పులిమేరు గ్రామంలో ఆదివారం కాకినాడ డివిజనల్ పోస్టల్ ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి, పోస్టల్ ఎఎస్‌పిలు ఆదినారాయణమూర్తి, భద్ర రావు ప్రసంగించారు. కార్తీక్ వన సమారాధనల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీనియర్ పోస్టల్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐపిఒ ప్రకాశరావు, ఇంటి సుబ్బారావు, ఎ.సురేంద్రనాథ్, పేపకాయల వీర్రాజు, చవ్వాకుల ఈశ్వరరావు, చలం, నాగార్జున పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

నైతిక విలువల్లేవు.. ఏ కమిటీలో ఉన్నాడంటావా..? ఎథిక్స్ కమిటీలో...!!

రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన ధర్నాలు

రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యాన ఆదివారం పలుచోట్ల నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

తాళ్లరేవు మండలం పటవల, శాంతమూల రహదారిలో రెండు పార్టీల నాయకులూ రోడ్లను పరిశీలించి నిరసన తెలిపారు. అత్తిలి బాబూరావు, కట్ట త్రిమూర్తులు మాట్లాడారు. ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, మోపూరి వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, జనసేన నాయకులు అత్తిలి బాబూరావు, కొమ్మోజు సుబ్రహ్మణ్యం, చిక్కం రామచంద్రుడు, పూసంశెట్టి సూర్యప్రకాష్, కాశి, జిత్తుగ శ్రీనివాస్, మల్లాడి సీతారామరాజు, అప్పన్న, చంటి పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని రమణయ్యపేట-జె.అన్నవరం రోడ్డు దుస్థితి నిరసిస్తూ టిడిపి, జనసేన కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. వరుపుల సత్యప్రభ, వరుపుల తమ్మయ్య బాబు మాట్లాడారు. **జగ్గంపేట రూరల్** మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పార్టీ శ్రేణులతో రామవరం నుంచి మర్రిపాక వరకు పాదయాత్ర చేపట్టారు. ఆయన వెంట టిడిపి నాయకులు జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, మారిశెట్టి భద్రం, జనసేన నాయకులు నల్లల శివ, సూరంపాలెం బాలు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

జగ్గంపేట రూరల్..

సేవ్ ద పీపుల్ ఆధ్వర్యాన బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం సాధ్యపడుతుందని సేవ్ ద పీపుల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుంకర సుధీర్ అన్నారు. ఆదివారం కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఆర్గనైజేషన్ చేసే కార్యక్రమంలో భాగంగా బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి, ముఖ్యంగా యువతను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. కాకినాడ బీచ్‌లో సుమారు టన్ను ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 30 మంది పాల్గొన్నారు.

బీచ్‌ను శుభ్రం చేసిన సేవ్ పీపుల్ సభ్యులు

నేరాలు ఘోరాలు

ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బిక్కవోలు

ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో రంగంపేట మండలం ముకుందవరానికి చెందిన షేక్ మౌలానా(42) మృతి చెందాడని ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు మండలం కొమరిపాలెంలో ఒక రైస్ మిల్లులో మౌలానా కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం ఎప్పటిలానే కూలి పనికి వెళ్లాడు. పనిముగించుకుని ఇంటికి వెళతుండగా బలబద్రపురం శివారు మురళీమోహన్ గుడౌన్ వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఎంపిటిసి సభ్యురాలి మృతి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన టిడిపి ఎంపిటిసి సభ్యురాలు ఈజ్జపు సూర్యకళ (26) ఆదివారం ఆనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆమె కుటుంబికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఆన తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యానికి ఆవంత్స కృషి

ప్రజాశక్తి-పిఠాపురం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ రచనలు చేశారని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సూర్యరయ్య విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కళారత్న డాక్టర్ ఆవంత్స సోమ సుందర్ శతజయంతిని నిర్వహించారు. తొలుత సోమసుందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడారు. నిబద్ధత కలిగిన రచయితగా తెలుగు సామాజిక చరిత్రలో మార్పు కోసం సోమ సుందర్ రచనలు చేశారన్నారు. 82 ఏళ్ల పాటు సమసమాజ నిర్మాణం కోసం సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సాహిత్య రచన, సాహిత్య ప్రచురణ, సాహిత్య ప్రోత్సాహం ఇలా విభిన్న రంగాల్లో సోమ సుందర్ చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ మనిషిని నడిపించేది ఒకటి సైన్స్ రెండోది సాహిత్యం అని కొడవటి గంటి కుటుంబరావు అన్న మాటలను గుర్తు చేశారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంలో సోమ సుందర్ ఎంతో కషి చేశారన్నారు. సాహిత్యానికి, కళలకు నేటి యువత దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం సోమ సుందర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు అడుగులు వేయాలని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెలికాన్ స్టాలిన్ మాట్లాడుతూ మతోన్మాదంపై, సామాజిక ఉగ్రతలపై కవిత్వం ద్వారా సోమసుందర్ పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల మీద స్పందించి రచనలు చేయటం సోమ సుందర్ ప్రత్యేకత అని అన్నారు. పిఆర్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరత లక్ష్మి మాట్లాడుతూ ఆరుద్ర సాహిత్యానికి పరిచయం చేసింది సోమసుందర్ అని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు గనార కమ్యూనిస్టుగా జీవితాంతం బతికిన గొప్ప మహోన్నత వ్యక్తి సోమసుందర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సహృదయ మిత్రమండలి మహిళా కార్యదర్శి పి.పావని, యువ రచయిత డాక్టర్ కిలారి గౌరి నాయుడు అభ్యుదయ గీతాలను ఆలపించారు. అనంతరం రచయిత గౌరవ్ రచించిన 'ఆకాశమంత అక్షర మూర్తి డాక్టర్ ఆవంత్స సోమసుందర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ఉపాధ్యక్షులు డాక్టర్ గజరాజు సీతారామస్వామి, సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ట్రెజరర్ మేకా మన్మధరావు, ఆవంత్స విజయ శేషేంద్ర శాతకర్ణి, గట్టి శ్రీకష్ణదేవరాయలు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, తట్టవర్తి సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షు వి సత్యనారాయణ రెడ్డి, కొండేపూడి శంకర్రావు, సతీష్, శ్రీనివాసరావు, సాహిత్య అభిమానులు, కవులు, కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఫైనల్ మ్యాచ్‌కోసం స్క్రీన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

భారత్ మూడోసారి ప్రపంచ కప్పు గెలవాలని ఆశిస్తూ యానాంలో స్థానిక ఎంఎల్ఎ కార్యాలయం, కనకాల పేట, కొత్తపేట, తోట వారి వీధి తదితర గ్రామాల్లో ఆదివారం భారత్ - ఆస్ట్రేలియా మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఈ ప్రపంచ కప్‌లో అన్ని మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించిందని, అదే స్ఫూర్తితో కప్పు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి - యానాం

స్థానిక సర్వేపల్లి రాధాకష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20 నుంచి 22 వరకూ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నేషనల్ వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వరుగు భాస్కరరెడ్డి తెలిపారు. కళాశాల సెమీనార్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ మునిస్వామి, అన్నవరం సత్యవతి దేవి(ఎఎస్ఒ) మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనంతలక్ష్మి పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషను చక్కగా మాట్లాడటం, అర్థం చేసుకోవడం, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో వాటిపై అవగాహన కలిగించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలని తెలిపారు.

అకిరా కంటి వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ కడలి ప్రసాద్

అమలాపురంలో పేరూరు వై.జంక్షన్ సమీపంలో బోసకుర్రు రోడ్డులో ఏర్పాటు చేసిన అకిరా కంటి ఆసుపత్రిని చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు కడలి ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడారు. తనకు విద్య నేర్పిన ప్రొఫెసర్ పేరుతోనే అకిర కంటి వైద్యశాలను స్థాపించానని తెలిపారు. అనంతరం ప్రసాద్ మాట్లాడారు. 37 ఏళ్లగా కంటి వైద్యంలో అపార అనుభవంతో రాజమహేంద్రవరంలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వీటిని విజయవాడ, అమలాపురం పట్టణాలకు విస్తరించారని తెలిపారు. 13 ఏళ్ల నుంచి యునైటెడ్ నర్సింగ్ హోమ్‌లో అకిరా వైద్య సేవలు అందించారని తెలిపారు. ఇప్పుడు పేరూరులో సొంత నూతన భవనంలోకి దీన్ని మార్చారని తెలిపారు. అత్యాధునిక నేత్ర వైద్య సేవలు ఇకపై జిల్లా పరిసర వాసులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దిన మిత్రులు, కన్సల్టెంట్ ఆర్కిటెక్ అండ్ ఇంటీరియర్ డిజైనర్ వి.షణ్ముఖ తేజ, శాతవాహన ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత చెరుకూరి మురళీకృష్ణలకు చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ నీలిమ, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ హరిప్రియ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.ఇంద్రజిత్, మెడికల్ సూపరింటెండెంట్లు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

కోరంగి ప్రజల సమస్యలు పట్టించుకోండి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి విచ్చేస్తున్న మంత్రులు, అధికారులు కోరంగి పంచాయతీ ప్రజల సమస్యలను పట్టించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కోరంగి పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యలపై పలుమార్లు జిల్లా, మండల స్థాయిలోని అధికారులకు అర్జీలు పెట్టినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. కొత్త కోరంగిలో బాలయోగి కళ్యాణ మండపం వద్ద మరో వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని, సీతారాంపురంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ పైపులైను వేయాలని, నిర్మించిన వాటర్ ట్యాంకులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సీతారాంపురంలో బేస్మెంట్లు వేసిన సచివాలయం హెల్త్ క్లినిక్ భవనాలను వెంటనే నిర్మించాలన్నారు. జగనన్న కాలనీలో పట్టాదారులకు స్థలాలను అప్పగించాలి. కోరంగి గ్రామంలో సర్వే నంబర్ 276/1 నుంచి 276/31 వరకు సుమారు 60 ఎకరాల అసైన్ భూమిని పేదలకు పంచాలన్నారు. అదే గ్రామంలో 402/1 సర్వే నంబరు వృద్ధాశ్రమం పక్కనగల సుమారు నాలుగున్నర ఎకరాలు గ్రామకంఠం భూమిని, కోరంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గరలో ఉన్న సుమారు రెండు ఎకరాల గ్రామకంఠం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలన్నారు. పాత కోరంగి హౌరా వంతెన నుంచి కోరంగి పెద్ద వంతెన వరకు ఫార్మసీ కాలేజ్ వెనుక భాగం నుంచి మాజీ ఎంఎల్ఎ మండపేట చౌదరి చెరువుల వరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేయించి పేద ప్రజలకు ఇవ్వాలని ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

సామాజిక సేవలతో ఔన్నత్యాన్ని చాటాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

సామాజిక సేవలతో ఔనత్యాన్ని చాటాలని కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ అన్నారు. అయినవిల్లి మండలం విలస గ్రామంలో శ్రీ కష్ణదేవరాయ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పూర్వీకులను ఆదర్శంగా తీసుకొని కాపు సామాజిక వర్గంతో పాటు సమాజానికి విద్య, వైద్య, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లోన్నూ ప్రతి గ్రామంలో సేవలందిం చాలన్నారు. దానికి తన వంతు సహకారం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమారాధనలో జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త మద్దా చంటిబాబు, కాపు నాయకులు నిమ్మకాయల జగయ్యానాయుడు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సరిపెల్ల కనకరాజు, మట్టపర్తి వెంకటరమణ(పండు), చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లా చిట్టిబాబు, దూడల ఫణి, ఎం.నాయుడు, కె.రాంబాబు, ఎ.దుర్గారావు, పి.ఆదినారాయణ, గంధం గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన కండేపల్లి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. పేద కుటుంబం కావడంతో ఆతని భార్య లక్ష్మి కి ఆదివారం వాడపర్రుకు నవోదయ శెట్టిబలిజ సంఘం రూ.11వేల ఆర్థిక సాయంతో పాటూ 25 కేజీల బియ్యం అందించింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, గుత్తుల బాబ్జి, మట్టపర్తి శ్రీనివాసరావు, చప్పిడి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కడలి సాయిబాబు, మట్టపర్తి సుధీర్, కముజు సాయి, మట్టపర్తి కృష్ణ, పాటి బాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి-కాకినాడ

సహకార రంగంలో కొనసాగుతున్న వ్యవస్థలన్నీ సమర్థవంతంగా పనిచేస్తున్నప్పుడే తగిన సార్థకత చేకూరుతుందని ఎపి స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ డిప్యూటీ రిజిస్ట్రార్, సహకార శిక్షణా కేంద్రం లెక్చరర్ వి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో కెసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాససత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సహకార వారోత్సవాల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో సహకార సొసైటీలు ఎలా అభివద్ధి చెందాలనే అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సహకార సంఘాలు పారదర్శకంగా పనిచేస్తూ సేవలు మెరుగుపరుచుకున్నాయన్నారు. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సహకార రంగం బలోపేతంగా ఉంటే వాటి ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. అనేక సంఘాలు స్వయం సమద్ధి సాధించి వేల నుంచి లక్ష్యాల్లో పంట రుణాలు, ఇతర ప్రయోజనాలను అందించగలుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి నరల్ మేనేజర్ జి.ప్రవీణ్‌కుమార్, కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివబాలయోగి, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితర ప్రముఖులు హాజరయ్యారు.

వైసిపి పాలనలో దళితులపై దాడులు

ప్రజాశక్తి-తాళ్లరేవు

వైసిపి పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమయ్యాయని టిడిపి ఎస్‌సి సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెల్లి అశోక్, జిల్లా అధ్యక్షుడు బొద్దింక నారాయణరావు అన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ విస్తతస్థాయి సమావేశం జక్కల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో అధ్యక్షుడు మోర్తా భైరవమూర్తి అధ్యక్షతన జైభీమ్ పేటలోని ప్రసాద్‌బాబు నివాసంలో ఆదివారం జరిగింది. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎస్‌సిలకు రావాల్సిన హక్కులను కాలరాస్తోందని, దళితులకు చెందిన 27 పథకాలను రద్దు చేసిందని, ఆ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులను రద్దు చేసి యువకులకు అన్యాయంచేశారన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకి రాకుండా ప్రతి ఎస్‌సి సెల్ కార్యకర్తా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దున్నా గౌతమ్, బీర రాజేష్, బోయిడి వేణుగోపాల్, దాసరి వేణు, వాకపల్లి చిరంజీవి, మహాలక్ష్మి, తాతపూడి నాగేశ్వరావు, దున్నా సుబ్రహ్మణ్యం, మురళీకష్ణ, వెంటపల్లి చంద్రమౌళి, ఉమామహేశ్వరి, గంటా రమేష్, గోపి, వస్కా రెడ్డి, ఐతే గోవింద్ పాల్గొన్నారు.

చరిత్రలో ఆలమూరుకు ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-ఆలమూరు

పుస్తక సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

చరిత్రలో ఆలమూరుకు స్థానం ప్రత్యేకమైనదని, తెలుగు సాహిత్యంలో, ఆధ్యాత్మికంగా, రాజకీయంగా గానీ, చారిత్రాత్మకంగా ఆలమూరుకున్న విశిష్టతలు ఎనలేనివని, అవన్నీ భావితరాలకు అందేలా నేటితరం కృషి చేయాలని దూరదర్శన్ రిటైర్డ్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, ప్రముఖ రచయిత సత్యవోలు సుందర సాయి అన్నారు. మండల కేంద్రానికి చెందిన 14 మంది రచయితల కథలతో రచయిత గొడవర్తి శ్రీనివాసు సంకలనం చేసిన 'ఆలమూరోళ్ల కథలు' సంపుటి స్థానిక గ్రామ దేవత రావులమ్మ అమ్మవారికి అంకిత కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యవోలు సుందరసాయి, ప్రముఖ కవి, శతక కర్త కామవరపు మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలమూరు చరిత్రలో కవులు, కథా రచయితలతో పాటు, ఎందరో ప్రముఖులు ఉన్నారన్నారు. వారందరి గురించి మరింత సమాచారం సేకరించి మరొక పుస్తక రూపంలో తీసుకొస్తే బాగుంటుందని సుందర సాయి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ నాతి లావణ్య, కుమార్‌రాజా దంపతులు ఆలమూరు ఖ్యాతిని వివరించారు. కామవరపు మల్లికార్జునరావు మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా ప్రముఖుల వివరాలు సేకరించి ఒక పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. తన శిష్యుడు గొడవర్తి శ్రీనివాసు దీనికి బాధ్యత వహించడం తనకు మరింత ఆనందదాయకంగా ఉందన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు నిర్వాహకులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, గాయకులు పెండ్యాల సుబ్బారావు, వుడతా వెంకటేశ్వర్లు, వాసా వెంకట దుర్గాప్రసాద్, కే.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్ర ప్రగతి : ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

పార్టీలో చేరిన వారితో ఎంఎల్ఎ చినరాజప్ప

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. వికె రాయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ రాయపురం ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు అధ్వర్యంలో పంచాయతీ వార్డ్ సభ్యులు సహ వందలాది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరందరికీ పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. అనంతరకాయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో ప్రకటించిన తొలి మేనిఫెస్టోలోని ఐదు పథకాలు అత్యద్భుతంగా ఉన్నాయన్నారు. వీటిపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లోనూ నష్టపోయిందన్నారు. మళ్లీ రాష్ట్రం ప్రగతి పథాన పయనించాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కాకినాడ పార్లమెంటరీ తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులచౌదరి, మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, కుర్రా నారాయణ స్వామి(రాజు), క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ సతీష్‌కుమార్‌కు సన్మానం

తాళ్ళరేవు : మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా దడాల సాల్మన్ రాజ్ (శ్రీనివాసరావు)ను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి సామ్యూల్ సాగర్‌ను ఆదివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. జెడ్‌పిటిసి సాగర్ స్వగహంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ మండల అధ్యక్షునిగా నియమితులైన సాల్మన్ రాజును ఎంఎల్ఎ పొన్నాడ అభినందించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రిస్టియన్ల అభివద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పంపన జాన్ ప్రసాద్, మల్లాడి అప్పారావు, దడాల మహేంద్ర విజయ్ కుమార్, విక్టర్, డేవిడ్ రాజు, జాన్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లికి జయహో జగన్ యాత్ర

గండేపల్లి: ఎంఎల్‌సి రఘురాజు చేపట్టిన జయహో జగన్ యాత్ర ఆదివారం నీలాద్రిరావుపేటకు చేరుకుంది. వీరికి జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఘన స్వాగతం పలికారు. సంఘీభావంగా కొంత దూరం పాదయాత్ర చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్ మళ్లీ సిఎం కావడం ముఖ్యమన్నారు. ఎంఎల్ఎ రఘురాజు శ్రీకాకుళం నుంచి సుమారు 800 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రతి కుటుంబానికి రూ.లక్షల మేర సాయం అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రఘురాజు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రతి గ్రామంలో ప్రతి నియోజకవర్గంలో ప్రజలు నాయకులు సంఘీభావం తెలపడం జగన్మోహన్ రెడ్డి గెలుపునకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కందులు చిట్టిబాబు, ఒబిన్ని వీరబాబు, బండారు రాజా, ఒమ్మి రఘురాం పాల్గొన్నారు.

వినోదాత్మకంగా 'ఐ హేట్ లవ్'

ప్రజాశక్తి-అమలాపురం

వినోదాత్మకంగా ఐ హేట్ లవ్ సినిమాను నిర్మించామని దర్శకుడు వెంకటేష్ తెలిపారు. కోనసీమ ప్రాంతంలో మారుమూల గ్రామమైన నేదునూరులో రావి ఫౌండేషన్ ద్వారా ఉత్తమ వైద్యం, ఉన్నత విద్య ఉచితంగా అందిస్తూ నైపుణ్యం కలిగిన యువతను ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నారు డాక్టర్ రవిబాల. ఇప్పుడు డాక్టర్ రవి బాల ప్రొడక్షన్స్ బ్యానర్ స్థాపించి నేదునూరు గ్రామవాసి వెంకటేష్‌కు దర్శకునిగా 'ఐ హేట్ లవ్' 'నేను ప్రేమలో పడ్డాను' ట్యాగ్‌లైన్‌తో సినిమాను నిర్మించారు. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఆదివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సినిమా నటీనటులు దర్శకులు నిర్మాత ఇతర సాంకేతిక పాల్గొన్నారు. కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలతో చక్కని కథలో అమర్చి మంచి సినిమా చూశాను అనే భావన ప్రేక్షకుల్లో కలిగించేలా వినోదాత్మకంగా మలిచామని దర్శకులు వెంకటేష్ తెలిపారు. ప్రేక్షకునికి మంచి రుచికరమైన కోనసీమ విందు భోజనం చేసిన అనుభూతి కలుగుతుందన్నారు. ఈ చిత్రం ద్వారా సుబ్బు, శ్రీవల్లి హీరో హీరోయిన్లగా పరిచయం అవుతున్నారు. పెద్దపల్లి రోహిత్ (పిఆర్) సంగీతాన్ని అందించారు. జబర్దస్త్ హాస్యనటులు తదితరులు ఈ చిత్రంలో నటించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు తేజ, భద్రాజీ, త్రిమూర్తులు స్టిల్ ఫోటోగ్రఫీ డిజిటల్ రవి, స్వామి వివేకానంద యువత సభ్యులు రాము, కృష్ణ, ముఖేష్, బద్రి, వెంకటేష్, నాగేశ్వరావు, పవన్ అర్జున్, చరణ్, కౌశిక్, పవన్ తేజ, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు భరోసా

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సహకార సంఘాలు రైతన్నల ఆర్థిక భరోసా కేంద్రాలని పిఎసిఎస్ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో 70వ సహకార వారోత్సవాలను పురస్కరించుకొని పథకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సహకార వ్యవస్థ ప్రారంభించి 70 ఏళ్ల కాలంలో లక్షలాది మంది రైతులకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ సహకార అధికారి జివిఎన్వి.ప్రసాద్, సిఇఒ జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దాసరి రమేష్, సిరిపరపు రాజేష్, కర్రి పోల రామాంజనేయులు, ఎర్రబుల్లి వీర్రాజు, వైసిపి నాయకులు బదిరెడ్డి గోవిందబాబు, జువ్విన వీర్రాజు, బుద్ధ సూర్య ప్రకాష్, సూతి వీర కృష్ణప్రసాద్, సహకార సంఘం ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ ఉన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ కురసాల కన్నబాబు

దేశ నిర్మాణంలో అంబేద్కర్‌ది కీలకపాత్ర

ప్రజాశక్తి -కరప

దేశ నిర్మాణంలో అంబేద్కర్ కీలక భూమిక పోషించి భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఆయన అగ్రగన్యుడుగా నిలిచారని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నడకుదురు గ్రామంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, గ్రామంలో తులసి నగర్‌లో రూ.90 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంక్, ఇంటింటికి కుళాయి కనెక్షన్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అంబేద్కర్ రాజ్యాంగం వల్లే నేడు హక్కులను పొందగలుగుతున్నామన్నారు. మహిళల హక్కుల కోసం మంత్రి పదవిని వదులుకున్న మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపిటిసి సభ్యులు బుచ్చిరాజు, పైలా రామతులసి, జవ్వాది సతీష్, సోని, చంద్రరావు, ఎం.గోవిందు, పాస్టర్ రాజకుమార్, సవిలే రాజేష్, సాదే రాఘవులు, సర్పంచ్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పులిమేరులో నంది విగ్రహం ప్రతిష్టాప

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం పులిమేరులోని గ్రామ సచివాలయం సమీపంలో ఆదివారం మాజీ సర్పంచ్ తుమ్మల సూర్య కష్ణమూర్తి దంపతులు నంది విగ్రహాన్ని ప్రతిష్టాపించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల నాని, బుల్లయ్య, దాడి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం ఈనెల 20న పులిమేరులో సాయిబాబా గుడి వద్ద కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహిస్తున్నట్లు తుమ్మల నాని తెలిపారు.

రానున్నది సంకీర్ణ ప్రభుత్వమే...

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్నది టిడిపి, జనసేనల సంకీర్ణ ప్రభుత్వమేనని మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. రామవరంలో పలువురు టిడిపిలో చేరారు. రామవరం మాజీఉప సర్పంచ్ అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారు టిడిపిలో చేరారు. జ్యోతుల నెహ్రూ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి, జనసేన కలయికతో ఆంధ్ర రాష్ట్రానికి ఒక నూతన వరవడితో పరిపాలన అందించేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ అనేక మంది వైసిపిని వీడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - మండపేట

స్థానిక శ్రీ జవహర్ లాల్ మున్సిపల్ హై స్కూల్ 1990-91బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏడిద శివార్లలో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన బాల్య మిత్రులందరూ ఒక్కచోట సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి తీర్మానించారు. తక్షణ సాయంగా ఇటీవల మృతి ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గనిశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా వంక వరశేఖరప్రసాద్, ఉపాధ్యక్షులుగా గండి స్వామిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి సూర్యభాస్కరరావు, కోశాధికారిగా కనపర్తి సుబ్రహ్మణ్యం కార్యవర్గ సభ్యులుగా పసలపూడి మధు సూదనరావు, పిట్టా రాజుబాబు, ఇల్లూరి సుందర రాజు, మందపల్లి చంద్ర శేఖర్, మల్లువలస గణపతి, లీగల్ అడ్వైజర్‌గా వంక సురేష్‌లను ఎన్నుకొన్నారు.

సత్యవేణికి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట రెండవ వార్డుకు చెందిన కాకరపల్లి సత్యవేణి జగనన్న ఇంటి స్థలం ఇచ్చినా, గృహ నిర్మాణానికి అధికారులు సహకరించడం లేదని తక్షణమే ఆమెకు న్యాయం చేయాలని ఆదివారం సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు పలు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సమస్యపై పలుమార్లు జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ ఇంటి స్థలాన్ని ఆక్రమించాడని, తక్షణమే చర్యలు తీసుకుని బాధితురాలు న్యాయం చేయాలన్నారు. లేకుంటే పలు సంఘాలతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు రాయుడు మోజేష్ బాబు, సందీప్ రాజు, కౌన్సిలర్ పితాని కృష్ణ, మాల మహానాడు నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కి సమస్యను వివరిస్తున్న పలు సంఘాల నాయకులు